క్లుప్తంగా

ఘనంగా కోత పండుగ



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట జైల్‌సింగ్ కాలనీ లూథరన్ చర్చిలో ఆదివారం కోత పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కాపరి రెవరెండ్ ఆలూరి సత్యానంద్ కుమార్ మాట్లాడుతూ బైబిల్‌లోని ధర్మం ప్రకారం దేవుడు ఇశ్రాయేలీయుల ప్రజలకు ప్రతి సంవత్సరం పండిన పంటలో నుంచి ప్రథమ ఫలములు దేవాలయమునకు తీసుకురావలెను అనే ఆజ్ఞ ప్రకారం ఈ పండుగ జరుపుకుంటున్నామన్నారు. క్రైస్తవులందరూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో వచ్చే ఆఖరి ఆదివారాన్ని కోత పండుగ ఆదివారంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొనుట ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ రోజు దేవాలయంలో సమర్పించే కానుకలన్నీ దేవుని ఆలయ అభివృద్ధి కొరకు వాడబడతాయన్నారు. ఆదివారం సువార్తను గుంటూరుకు చెందిన పాస్టర్ డాక్టర్ తాళ్లూరి మాధ్యూభాస్కర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘస్తులు, పిల్లలు, యవనస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కోరారు. పట్టణంలోని కార్తికేయ హోటల్ ఆదివారం జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ గ్రామాల్లోని కూటమి నాయకులందరూ పట్టభద్రులందరి చేత ఆలపాటికి ఓటు వేసి గెలిపించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. పల్నాడు జిల్లా జనసేన ఎన్నికల పరిశీలకులు వడ్రాణం మార్కండేయబాబు, నాయకులు తవిటి భవన్నారాయణ, శిరిగిరి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి మల్లీశ్వరి, టీడీపీ నాయకులు యెలినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, పూజల వెంకటకోటయ్య పాల్గొన్నారు.

సాగర్ కుడికాలువ పరిధిలో వార బంది

రెంటచింతల: నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో ఈ ఏడాది నీటి నిల్వలు తగ్గినందున ఈ నెల 28 నుంచి సాగర్ కుడి కాలువ పరిధిలో వారా బంది అమలుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారని మండల వ్యవసాయశాఖ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పక్షంలో 9 రోజులు లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని కాలువలకు నీటి సరఫరా చేసిన అనంతరం ఈ నెల 28 నుంచి 6 రోజులు పాటు నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి నాగార్జున సాగర్ రిజర్వాయర్ పరిధిలోని రైతులందరూ సాగునీటిని జాగ్రత్తగా అవసరం మేరకు వినియోగించుకోవాలన్నారు. సాగునీటిని వృథా చేయకుండా రైతులు సహకరించాలని ఆయన కోరారు.

26న శివపార్వతుల కల్యాణం

వినుకొండ: మహా శివరాత్రి సందర్భంగా శాంతి ఆశ్రమం ట్రస్ట్ వినుకొండ ఆధ్వర్యంలో సాయి బృందావనం చిన్న షిరిడీ వద్ద శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు హిమాలయ గురూజీ ఆదివారం తెలిపారు. శివరాత్రి జాగారంలో భాగంగా రాత్రి అఘోర భస్మాభిషేకం, లింగోద్భవ సమయంలో శివుడికి చండీ ప్రదక్షణ, అన్నాభిషేకం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ అధ్యక్షులు పెండేల వెంకట మోహనరావు, కె. అనంత కోటేశ్వరరావు, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, పెండేల పుల్లారావు, మునిరెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



వినుకొండ: పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ కాలనీలో గల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆదివారం హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మరనాత వెల్లటూరు యేసయ్య సహకారంతో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారిణి ఎస్. రేణుకమ్మ మాట్లాడుతూ మనిషి జీవనశైలిని మార్చగలిగేది చదువు ఒక్కటేనని తెలిపారు. చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు. హెల్ప్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, సమాధానం, వినయ్ పాల్గొన్నారు.

మా కష్టాలు తీర్చరూ...

- నీటి కోసం పులిచింతల నిర్వాసితుల వేడుకోలు
- నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారే లేరు



చౌటపాపాయపాలెం నిర్వాసిత కేంద్రం ఏరియల్ వ్యూ





నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌లు

రాజుపాలెం: పులిచింతల నిర్వాసిత కేంద్రంలో లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కట్టిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు అలంకారప్రాయంగా మారాయి. నిర్వాసిత కేంద్రాలను ఏర్పాటు చేసే సమయంలోనే ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించారు. దాహార్తి తీర్చేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించినా నిర్వాసితులకు మంచినీటి కష్టాలు తప్పలేదు. సుమారు 15 ఏళ్ల క్రితం నిర్వాసితులకు నీళ్ల ట్యాంకులతో పాటు బోరింగ్‌లు వేసి వాటికి విద్యుత్ మోటార్లను బిగించారు. అయినా అవి సక్రమంగా పనిచేయకపోవడం, తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో నీటికి అవస్థలు పడుతూనే ఉన్నారు. అప్పటి అధికారులు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటిని ఎక్కించి ప్రతి బజారుకు సరఫరా అయ్యే విధంగా ట్యాప్‌లు బిగించారు. అయినా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటిని ఎక్కించలేకపోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అవి నిరుపయోగంగా ఉన్నాయి.

ట్యాంకులను ఉపయోగంలోకి తేవాలి

మండలంలోని చౌటపాపాయపాలెం పంచాయతీ పరిధిలో పులిచింతల నిర్వాసిత కేంద్రంను 153 ఎకరాలలో ఏర్పాటు చేశారు. ముంపు గ్రామాలైన బోదనం, కోళ్లూరు, గొల్లపేట, చిట్యాల, గోపాలపురం తదితర గ్రామాలకు చెందిన వారు ఇక్కడికి తరలివచ్చారు. కేంద్రంలో 2500 ప్లాట్లను ఏర్పాటు చేశారు. అందులో సుమారు 2000 ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకున్నారు. సుమారు 3,500 మంది ఇక్కడ నివసిస్తున్నారు. నిర్వాసితుల కేంద్రంలో ఆరు బోర్లు వేసి విద్యుత్ మోటార్లను బిగించి నీటిని సరఫరా చేస్తున్నారు. విద్యుత్ మోటార్లు సక్రమంగా పనిచేయక పోవడంలో నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. కాగా మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో నీటి సరఫరా నిలిచిపోతుంది. ఒకసారి మోటార్లు మరమ్మతులకు గురయితే వాటిని పట్టించుకునే వారు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్లు కొండ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో బోరు వేసుకుందామన్నా నీళ్లు పడక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఈ నిర్వాసిత కేంద్రానికి పంచాయతీ హోదా కల్పిస్తూ న్యూ బోదనంగా నామకరణం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓవర్ హెడ్ ట్యాంకలను ఉపయోగంలోకి తీసుకువచ్చి నీటిని సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

200 నుంచి 300 అడుగులు వేస్తేనే నీరు



మాకు కొండ ప్రాంతానికి సమీపంలో నిర్వాసిత కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాస్త స్థోమత ఉన్న వారు 300 అడుగుల వరకు బోరు వేసుకుంటేనే కొంచెం నీరు వస్తుంది. స్థోమత లేనివారి బోర్లు వేసుకోలేక నీటికి కష్టాలు పడుతున్నారు. ఈ కేంద్రంలో 80 శాతం మంది ఎస్సీ, ఎస్టీలు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు నీరు ఎక్కించి సరఫరా చేయాలి.

– భూక్యా రమేష్‌నాయక్, నిర్వాసితుడు

క్యాన్ రూ.20కి కొంటున్నాం



తాగడానికి క్యాన్ వాటర్ రూ.20కి కొంటున్నాను. ఒక్కొక్క ఇంటికి రోజుకు రెండు నుంచి మూడు క్యాన్‌ల వాటరు పడుతుంది. రెక్కాడితే గాని డొక్కాడని నిర్వాసితులైన మేము రోజూ నీళ్లు కొనుక్కుని తాగాలంటే అల్లాడిపోతున్నాం. అధికారులు స్పందించి ఉచితంగా తాగునీరు సరఫరా చేయాలి.

– రాంపాటి లక్ష్మయ్య, నిర్వాసితుడు

నీటి కొరత తీవ్రంగా ఉంది



మేము సర్వస్వం కోల్పోయి ఇక్కడికి పెట్టె బేడా సర్దుకుని వచ్చాం. వచ్చి 15 ఏళ్లు అవుతున్నా ఇప్పటి వరకు నీటికొరత తీరలేదు. రెండురోజులకొకసారి మోటార్ల ద్వారా నీరు వస్తుంది. నీటి కొరత వలన రెండు రోజులకు ఒకసారి స్నానాలు చేయాల్సి వస్తుంది. ఇప్పటికై నా అధికారులు స్పందించి నీటిని సరఫరా చేయాలి.

– కుంభా వెంకటేశ్వర్లు, నిర్వాసితుడు

తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలి



క్రోసూరు: ఇళ్లల్లో తడి, పొడి చెత్త వేరువేరుగా బకెట్లలో పెట్టుకుని ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్స్‌కు మాత్రమే ఇవ్వాలని, ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై వేయకూడదని పంచాయతీ రెండు రోజులుగా మైకు ప్రచారం చేపట్టింది. క్రోసూరు పంచాయతీలో చెత్త చెదారాన్ని ఇళ్లల్లోని వారు, వ్యాపారుస్తులు, హోటళ్ల నిర్వాహకులు, కూరగాయల దుకాణదారులు బయట పడేవేయకూడదని గ్రీన్ అంబాసిడర్స్‌కు అందజేయాలని కోరారు. అలాకాకుండా రోడ్లమీద వేసి అపరిశుభ్రం చేసే వారిపై పంచాయతీ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. కాబట్టి పంచాయతీలోని ప్రజలందరూ పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించి పంచాయతీని శుభ్రంగా ఉంచాలని కోరారు.

బుగ్గమల్లేశ్వరస్వామిని సన్నిధిలో గురజాల డీఎస్పీ

మాచవరం: మండలంలోని మోర్జంపాడు భ్రమరాంబ సమేత బుగ్గ మల్లేశ్వరస్వామిని గురజాల డీఎస్పీ జగదీష్ ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు డీఎస్పీని శాలువాలతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో భద్రతా ఏర్పాట్లు పరిశీలించేందుకు వచ్చినట్లు డీఎస్పీ చెప్పారు. శివరాత్రి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట స్థానిక ఎస్‌ఐ కె.సతీష్, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు ఉన్నారు.

ఘనంగా అంకమ్మతల్లి తిరునాళ్ల



అంకమ్మతల్లి ఆలయానికి ఊరేగింపుగా వచ్చిన దైవాలు



అమ్మవారికి ఊరేగింపుగా బోనాలు తీసుకొస్తున్న భక్తులు

రాజుపాలెం: మండల కేంద్రంలో కొలువుదీరిన అంకమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి రాజుపాలెం–గంగిరెడ్డిపాలెం భక్తులు తొలి ధాన్యపు కంకులతో పొంగళ్లు చేసి, మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి బోనాలు సమర్పించారు. కారంపూడి వీర్ల దేవాలయంలోని వీరుల ఆయుధాల(దైవాలు)ను తిరునాళ్లకు తీసుకొచ్చి శనివారం రాత్రి రాజుపాలెం, గంగిరెడ్డిపాలెం పురవీధుల్లో ఊరేగిస్తూ సేవచేస్తూ ఆదివారం అంకమ్మతల్లి దేవాలయానికి తీసుకొచ్చి మొక్కులు తీర్చుకున్నారు. నవోదయ పాఠశాల విద్యార్థుల కోలాటం, మహిళల కోలాటం చూపరులను ఆకట్టుకున్నాయి. అమ్మవారికి చీర సారెలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోలాటాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మోడల్ స్కూలులో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

రొంపిచర్ల : మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల ఏపీ మోడల్ స్కూలులో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ బి. రవినాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 20న పాఠశాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9701030357 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



నరసరావుపేట టౌన్: ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ అరుణ ఆదివారం తెలిపారు. సుమారు 30 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించామని చెప్పారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించామని తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలిసివారు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

వృద్ధుడి నేత్రాలు దానం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన విప్పర్ల బాల అంజయ్య (70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ క్రమంలో మృతుడి కుటుంబ సభ్యుల అనుమతితో నేత్రాలను శంకర ఐ బ్యాంకుకు దానం చేసినట్లు అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకులు, సంఘం జిల్లా కోఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావు తెలిపారు. బాల అంజయ్య నేత్రాలు దానం చేయడం ఆదర్శనీయమని కొనియాడారు. నేత్ర దానానికి సహకరించిన కుటుంబ సభ్యులు ప్రసన్నాంజనేయులు, మారుతి, శివప్రసాద్‌ను ఆయన అభినందించారు.

బస్టాండ్ కాదు పార్కింగ్ అడ్డా



బస్టాండ్‌లో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో ఆర్టీసీ బస్టాండ్ ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. ప్రయాణికులు బస్టాండ్‌లో కూర్చోవడానికి కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని కొన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాస్ ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, బస్టాండ్‌ను పరిశీలించాలని కోరారు. బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవు. కొందరు ద్విచక్ర వాహనాలను లోపలే పార్క్ చేస్తున్నారు. మరికొందరు ఆటోలను ముందు నిలుపుదల చేస్తున్నారు. దీంతో బస్ కోసం ఎక్కడ వేచి ఉండాలో ప్రయాణికులకు తెలియడం లేదు. ఆర్టీసీ అధికారులు సౌకర్యాలు కల్పించడానికి కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా సరస్వతి శిశు విద్యామందిర్ వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు

అమరావతి: స్థానిక సరస్వతి శిశు విద్యా మందిర్ 34వ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు, గేయాలతో తల్లిదండ్రులు, పెద్దలను ఆలరింపజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి విద్యాభారతి గుంటూరు విభాగ కార్యదర్శి అబ్బూరి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యపట్ల తల్లిదండ్రుల ధోరణి మారాలని ర్యాంకులు, మార్కుల కోసం కాకుండా విద్యార్థుల్లో సృజనాత్మకత నైపుణ్యం, శీల నిర్మాణం కలిగేలా స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కలిపించారా లేదా అనేది చూడాలన్నారు. క్రమశిక్షణ, మంచి నడవడిక అలవడటానికి సరస్వతి శిశు మందిరాలలో విద్యార్థులను చేర్పించాలన్నారు. ధాన్యకటక బుద్ధ విహార ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు మాట్లాడుతూ పది సంవత్సరాల లోపు చిన్నారులకు ఆటపాటలతో మాతృభాషలో ఇద్దరు నేర్పితే వారు భవిష్యత్‌లో ఏ రంగంలోనైనా మంచి నిష్ణాతులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షుడు పులిపాటి వెంకట పవన్‌కుమార్ ప్రధానోపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావు, ఆచార్యులు, విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు పాఠశాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

నకరికల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ కె.పుల్లారావు ఆదివారం తెలిపారు. మండలంలోని గ్రామాల నుంచి అర్జీలు ఇచ్చేందుకు వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తగిన పరిష్కారం చూపాలని సూచించారు.

పడకేసిన అభివృద్ధి పనులు

- ఫేజ్–1లో 19 పాఠశాలలకు రూ.5.20 కోట్ల పనులు పూర్తి
- ఫేజ్–2లో 43 పాఠశాలలకు రూ.13.39 కోట్ల పనుల్లో 59 శాతం పూర్తి
- కూటమి ప్రభుత్వంలో నిలిచిపోయిన నాడు–నేడు పనులు



కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

క్రోసూరు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు, అందులోను ప్రభుత్వ పాఠశాలలకు ప్రాధాన్యతను ఇచ్చి, వాటిని అభివృద్ధి పరిచి, అందులో పేద విద్యార్థుల కొరకు ఇంగ్లీష్ మీడియంతో పాటు ప్రైవేటు పాఠశాలల కంటే మిన్నగా తీర్చేదిద్దే విధంగా ప్రతిష్టాత్మకంగా నాడు–నేడు కింద పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు చేపట్టిన పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పడకేసాయి. మండలంలో నాడు–నేడు కింద ఫేజ్–1లో 19 పాఠశాలలకు రూ.5.20 కోట్లు మంజూరు చేసి వంద శాతం పనులు పూర్తి చేయటం జరిగింది. రెండవ ఫేజ్‌లో 43 పాఠశాలల మరమ్మతులు, కాంపౌండ్ వాల్స్, అదనపు తరగతి గదుల నిర్మాణాల కొరకు మొత్తం రూ.13.39 కోట్ల నిధులు మంజూరు చేసి 59 శాతం పనులు పూర్తి చేశారు. 2024 ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాలల పనులు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. అందుకు ఉదాహరణగా మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో ఎనిమిది అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.104 లక్షలు మంజరూయ్యాయి. ఆ నిధులతో పాఠశాలలో 45 శాతం పనులు పూర్తిచేయటం జరిగింది. మిగతా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

252 మంది విద్యార్థులు

కేజీబీవీలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బాలికలు ఇక్కడే ఇంటర్‌మీడియట్ చదువుకునేందుకు తరగతికి 40 మంది విద్యార్థులుండే విధంగా ఏర్పాటు చేయటం జరిగింది. ఈ ఏడాది ఇంటర్‌తో కలిపి పాఠశాలలో 252 మంది బాలికలు చదువుకుంటున్నారు. ఇందులో ఇంటర్ విద్యార్థులు (ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి) 62 మంది ఉన్నారు. అందులోనూ ప్రస్తుతం ఎంపీసీ గ్రూపు మాత్రమే నిర్వహిస్తున్నారు. పాఠశాలకు అదనపు తరగతి గదులుంటే ఇంటర్‌లో అదనపు గ్రూపులు నిర్వహించటమేకాక, అదనంగా పేద బాలికలు చదువుకునేందుకు వీలుపడుతుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలో చేపట్టవచ్చు



పాఠశాలల అభివృద్ధి కొరకు చేపట్టిన నాడు–నేడు పనులు గత ప్రభుత్వం తరువాత నిలిచిపోయాయి. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ చెప్పటం జరిగింది. పనులు త్వరలో చేపట్టవచ్చునని భావిస్తున్నాను.

– ఎం.గణేష్, ఎంఈవో, క్రోసూరు

●ముళ్ల చెట్లు తొలగించరూ..!



ముళ్ల చెట్లతో నిండిన హిందూ శ్మశానం

మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఉన్న హిందూ శ్మశానం ముళ్ల చెట్లతో నిండిపోయింది. చివరి మజిలీ శ్మశాన స్థలం ముళ్ల చెట్లతో నిండిపోవటంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దాతల సాయంతో మరమ్మతులు చేపట్టామని, మరలా చెట్లతో నిండి రాత్రి వేళల్లో విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని పరిసర నివాసితులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి ముళ్ల చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

– చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ)

స్నేహం, సేవా భావం రోటరీ లక్ష్యం



కందిపప్పు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చిలకలూరిపేట: ప్రపంచ శాంతి, స్నేహం, సేవా భావం లక్ష్యంగా రోటరీ సంస్థ ఏర్పాటైందని రోటరీ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ జాష్టి రంగారావు చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా రోటరీ వ్యవస్థాపకుడు పాల్ హారిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగారావు మాట్లాడుతూ 1905లో నలుగురు సభ్యులతో స్థాపించిన సంస్థ ప్రస్తుతం 200 దేశాలలో వేల క్లబ్‌లు, లక్షల సభ్యులతో సేవలు అందజేస్తుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, రైతులకు చెక్‌డ్యామ్‌లు, పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, సైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ బాధితులకు సేవలు అందించే స్వచ్ఛంద సంస్థకు స్థానిక క్లబ్ మాజీ అధ్యక్షుడు గళ్ల సాంబశివరావు 50 కేజీలు కందిపప్పు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు అళ్ల వేమనరెడ్డి, కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, అహమ్మద్, వెంకటరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామలింగేశ్వరస్వామికి పూజలు



వినుకొండ : స్థానిక శ్రీ ప్రసన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో వినుకొండ నియోజకవర్గ వేదమాత బ్రాహ్మణ అర్చక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పలు పూజలు నిర్వహించారు. నగర సంకీర్తన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిళ్వార్చన, సువాసినీలతో లక్ష కుంకుమార్చనతో పాటు వఠెం వేణుశర్మతో శ్రీచక్ర అర్చన జరిపారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు పాలపర్తి సుబ్బయ్య, చంగవల్లి శ్రీరామచంద్రబాబు, నారాయణం రామ్మోహన్ ఆచార్యులు, మెరుసుపల్లి రాఘవశర్మ, పోతుకూచి శ్రీనివాసశాస్త్రి, వేలమూరు శేషసాయిశర్మ, వెలమకన్ని చంద్రశేఖర్‌శర్మ, ప్రతాపగిరి విష్ణుశర్మ, వేలమూరి సాయిశర్మ, యనమండ్ర సాయిరామశర్మ, గాలి రమణారావు, పి.వి.సురేష్‌బాబు, గాలి శ్రీనివాసరావు, యడవల్లి శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.